మట్టి నమూనాల సేకరణపై శిక్షణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మట్టి పరీక్ష శిక్షణ వారోత్సవాల్లో భాగంగా గురువారం మదనపల్లి వ్యవసాయ అధికారి కార్యాలయంలో మండల పరిధిలోని ఆర్‌బికె సిబ్బందికి మట్టి పరీక్షల ఆవశ్యకత, మట్టి పరీక్షలకు రైతుల పొలంలో మట్టి నమూనాల సేకరణ తదితర అంశాలపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం వ్యవసాయాధికారి నాగప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మదనపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు కె.శివశంకర్, భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయ అధికారి వెంకటరమణలు హాజరయ్యారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ త్వరలోనే ప్రతి ఆర్‌బికె నుంచి మట్టి నమూనా సేకరణకై లక్ష్యాలు నిర్దేశించి, రైతుల పొలంలో మట్టి నమూనాలను సేకరించి ఆ సంబంధిత భూసార ఫలితాలను రైతులకు అందజేస్తామన్నారు. రైతులు భూసార పరీక్ష ఫలితాలను ఆధారంగా ఎరువులను వినియోగించినట్లయితే పెట్టుబడులు తగ్గి అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలియజేశారు. పంటల సాగులో రైతులు వ్యవసాయ అధికారులు, ఆర్‌బికె సిబ్బంది సూచనలు సలహాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

వెనుకబడిన ప్రాంతాలకు వెన్నుపోటు!

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాల అమలుకు వ్యతిరేకంగా ప్రచార భేరి మోగింది. సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి నెలాఖరు వరకు దేశవ్యాప్తంగా మోడీని గద్దెదించండి...దేశాన్ని కాపాడండి అనే నినాదంతో పెద్దఎత్తున ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. కేంద్ర ప్రభుత్వం దేశంలోని ఆయా రాష్ట్రాలకు, ఆయా ప్రాంతాలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించనుంది. కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల కుదింపు, కార్మిక, కర్షకవర్గ ప్రయోజనాలు, లేబర్ కోడ్‌ల కుదింపు, బడుగు, బలహీన వర్గాల ప్రయోజనాల్ని దెబ్బతీసే విధానాలకు వ్యతిరేకంగా సమరశంఖం పూరించనుంది. రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల నిధుల్ని రాష్ట్ర ఖాతా నుంచి వెనక్కి తీసుకోవడం, రాయలసీమ డిక్లరేషన్ అమలు, కడప జిల్లాకు ఇచ్చిన సెయిల్ ఆధ్వర్యంలోని ఉక్కు పరిశ్రమ ఏర్పాటు వంటి హామీల అమలులోని కాపట్యాన్ని ప్రశ్నిస్తూ వామపక్షాలు ప్రచార భేరి చేపట్టనుండడంపై కథనం...

- కోల్డ్ స్టోరేజీలోకి కడప-బెంగళూరు రైల్వేలైన్
- సెయిల్ ఆధ్వర్యంలో 'ఉక్కు'కు మొండిచేయి
- అమలుకు నోచని రాయలసీమ డిక్లరేషన్
- నేటి నుంచి వామపక్షాల ప్రచార భేరి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కేంద్రం రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలకు చేసిన అన్యాయంపై మరోసారి పెద్దఎత్తున గళం వినినిపించనుంది. వామపక్షాల ఆధ్వ ర్యం లో ప్రచారభేరి మోగించాయి రాష్ట్ర విభజన చట్టంలోని ప్రధాన హామీలైన రాయ లసీమ ఉత్తరాంధ్ర వంటి వెనుకబడిన జిల్లాలకు ఏటా రూ.50 కోట్ల చొప్పున ఇవ్వాల్సిన నిధులు విడుదల చేయకపోవడంపై ప్ర చారం సాగి ంచనుంది. నాలుగేళ్ల కిందట రాష్ట్ర ఖాతాకు బదిలీ చేసిన రూ.350 కోట్లను వెనక్కి తీసుకోవడం చర్చనీయాంశంగా మారనుంది. సెయిల్ ఆధ్వర్యంలో కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలనే రాష్ట్ర విభజన హామీని అమలు చేయకపోవడంపై గళం విప్పనుంది. వెనుకబడిన ప్రాంతమైన కడప జిల్లా నుంచి ఉపాధి నిమిత్తం హైదరాబాద్, చెన్నయ్, బెంగళూరు, గల్ఫ్ దేశాలైన కువైట్, సౌదీ, కతార్, బహ్రెయిన్ వంటి దేశాలకు లక్షలాది మంది వలసలు వెళ్లడం ఆందోళన కలిగిస్తోంది. వెనుకబడిన ప్రాంతంలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తే ప్రత్యక్ష, పరోక్షంగా సుమారు లక్ష మంది నిరుద్యోగులకు ఉపాధి లభించే అవ కాశం ఉంది. కడప -బెంగళూరు రైల్వేలైన్ కేంద్ర ప్రభుత్వ సంకుచిత వైఖరి కారణంగా కోల్డ్ స్టోరేజీకి చేరుకోవడం ఆందోళన కలిగి స్తోంది. రాష్ట్ర ప్రభు త్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వలేదనే పేరుతో జాతి భవితకు ముడిపడిన రైల్వేలైన్‌ను మూలన పడేయడం ఎంతవరకు సమంజసమనే విమర్శ వినిపిస్తోంది. కర్షక వ్యతిరేక విధానాల్లో భాగంగా రైతుల మోటార్లకు మీటర్లు బిగించడం వంటి విద్యుత్ రెగ్యులేటరీ చట్టాల్లో మార్పులు తీసుకురావడం వంటి విధానాలను నిలువరించాల్సి ఉంది. బిజెపి ప్రవచిత రాయలసీమ డిక్లరేషన్ అమలు అటకెక్కించింది. ఇచ్చిన హామీల అమలుకు ఎన్నికల ప్రయోజనాలే పరమావధిగా ఉంటాయనే వాదనకు బలం చేకూరుతోంది. ఆయుష్మాన్ భారత్ పథకం లేకపోవడంతో అమలు అంతంత మాత్రమేనని తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా వామపక్షాలు తలపెట్టిన మోడీని గద్దెదించండి...దేశాన్ని కాపాడండి అనే నినాదంతో చేపట్టిన ప్రచారభేరి కార్యక్రమాన్ని ఆదరించి, ప్రత్యామ్నాయ విధానాలను బలపంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

మతోన్మాద బిజెపిని సాగనంపుదాం

దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. ప్రతి వ్యక్తి గొంతెత్తి కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయవలసిన సమయమిది. లేకుంటే మనందరి భవిష్యత్తు చీకటిమయమైపోతుంది. మోడీ, అమిత్‌షాల నాయకత్వంలో బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ కూటమి అన్నదమ్ముల్లా కలిసి మెలిసి ఉండవలసిన ప్రజల మధ్య మత విద్వేషపు చిచ్చురాజేస్తున్నది. మరోవైపు అదానీ, అంబానీ లాంటి అతి సంపన్నులకు దేశ సంపదను దోచిపెడుతోంది. ప్రశ్నించే ప్రతి ఒక్కరినీ నిరంకుశంగా అణచివేస్తున్నారు. నాడు అనేక మంది త్యాగధనులు బ్రిటిష్ వలస పాలనను ఎదిరించి తరిమికొట్టి మనకి స్వాతంత్ర్యం తెచ్చారు. నేడు అదే స్వాతంత్ర్యం పెనుప్రమాదంలో పడింది. దానిని కాపాడుకోడానికి మనం ఆనాటి జాతీయోద్యమ స్ఫూర్తితో మళ్లీ ఉద్యమించాల్సిన సమయం వచ్చింది.

- పి.శ్రీనివాసులు, సిపిఎం జిల్లా కార్యదర్శి, అన్నమ్మయ్య.

రాష్ట్రానికి బిజెపి తీవ్ర అన్యాయం చేసింది

రాష్ట్రానికి బిజెపి తీవ్ర అన్యాయం చేసింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజలు దాన్ని ఎక్కడ పెట్టాలో అక్కడ పెట్టారు. ప్రత్యేక హోదా ఇవ్వబోమని కేంద్రం చెబుతోంది, ఇంతకంటే అన్యా యం మరొకటి లేదు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అదానీకి కట్టబెట్టేందుకు చూస్తున్నారు. గ్యాస్, పెట్రోలు, విద్యుత్ ఛార్జీలు, ఆస్తి, చెత్తపన్ను భారాలు ప్రజలపై మోపారు. బిజెపి మతోన్మాదంపై వైసిపి, టిడిపి, జనసేన నాయకులు నోరెత్తడం లేదు. మోడీని చూసి భయపడుతున్నారు.

- పి.ఎల్.నరసింహులు, సిపిఐ జిల్లా కార్యదర్శి, అన్నమయ్య.

రీ సర్వే పనులు వేగవంతం : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

జిల్లాలో రీ సర్వే ప్రక్రియ పనులను వేగవంతంగా పూర్తి చేస్తున్నామని కలెక్టర్ గిరీష రాష్ట్ర భూ పరిపాలన కమిషనరు జి.సాయిప్రసాద్‌కు వివరించారు. గురువారం విజయవాడలోని సిసిఎల్‌ఎ కార్యాలయం నుంచి రాష్ట్రంలో జరుగుతున్న రీసర్వే ప్రగతిపై రాష్ట్ర భూ పరిపాలన కమిషనరు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా మొదటి దశలో రీ సర్వే పూర్తి చేసిన గ్రామాలలో వెబ్ ల్యాండ్ ప్రగతి, పాస్ పుస్తకాలు ప్రింటింగ్, హద్దురాళ్ల పాతడం, జిసిపి మార్కింగ్, చెకింగ్ పాయింట్స్ గుర్తింపు, డ్రోన్ ఫ్లయింగ్, గ్రౌండ్ ట్రూతింగ్ నోటీసుల పంపిణీ, సెక్షన్ (13) నోటిఫికేషన్ల ప్రగతి తదితర అంశాలలో కలెక్టర్లతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి దశ రీ సర్వే పూర్తి చేసిన గ్రామాలలో హద్దురాళ్ల పాతడం, ఖాతాలకు ఫొటో మ్యాపింగ్ తదితర ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. రీ సర్వే పూర్తయిన మండలాలకు ఇప్పటికే రోవర్లను పంపామని చెప్పారు. వాటి ద్వారా హద్దురాళ్ల పాతే ప్రక్రియను తహశీల్దార్లు, సర్వే శాఖ సిబ్బందితో రోజూ సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. రీ సర్వేకు సంబంధించి ఆయా ప్రక్రియల పనులను కూడా లక్ష్యం మేరకు నిర్దిష్ట కాల పరిమితిలో పూర్తి చేయడానికి కృషి చేస్తున్నామని కలెక్టర్ వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్‌ఒ సత్యనారాయణ, కలెక్టరేట్ ఎఒ బాలకృష్ణ, సర్వే శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో ఘరానా మోసం

- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు
- 13 ముద్రణ అచ్చులు, 2 సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్ స్వాధీనం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి శ్రీధర్

రాయచోటిలో ఉద్యోగాల పేరుతో ఘరానా మోసం చోటుచేసుకుంది. బాధితులు పోలీసులు ఫిర్యాదు చేయడంతో ఈ మోసం వెలుగుచూసింది. ఈ ఘరానా మోసంలో ఇద్దరి హస్తం ఉంది. గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిఎస్‌పి శ్రీధర్ మాట్లాడుతూ గుర్రంకొండకు చెందిన నవీన్ కుమార్, కదిరికి చెందిన మహేష్ నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తానని ఆశచూపి భారీగా డబ్బులు దండుకున్నారని పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నిరుద్యోగులకు మోసం చేశారన్నారు. ప్రభుత్వం జాబ్ క్యాలెండరు విడుదల చేసిందని, కలెక్టర్ పిఎ, ఆఫీస్ అసిస్టెంట్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఒక్కొక్కరి దగ్గర నుండి రూ. 1.15 లక్షల చొప్పున ఆరుగురి దగ్గర వసూలు చేసి ప్రభుత్వ ముద్రతో కూడిన నకిలీ నియామక పత్రాలు సమర్పించారని చెప్పారు. ఆ పత్రాలతో ఉద్యోగంలో చేరుటకు కలెక్టర్ కార్యాలయానికి వెళ్లిన బాధితులు మోసపోయామని తెలుసుకున్నారు. వెంటనే వారు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు రంగంలోకి దిగారని చెప్పారు. నిందుతులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన ముద్రణ అచ్చులు (సీళ్ళు)-13, మొబైల్ ఫోన్లు-2, ఒక ల్యాప్‌టాప్ స్వాధీనంచేసుకున్నారని చెప్పారు. నిందితులు గతంలోనూ రైల్వే శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ విజయవాడలో కొందరినీ మోసం చేసి రూ. 55 లక్షలు వసూలు చేశారని తెలిపారు. ఆన్‌లైన్‌జూదం , బెట్టింగులు లాంటి చెడు వ్యసనాలకు బానిసై అధిక మొత్తంలో చేసిన అప్పులు తీర్చడం కోసం ఇటువంటి మోసాలకు పాల్పడినట్లు తెలిపారు. వ్యసనాలకు బానిసై ఇటువంటి ఘరానా మోసాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవు అని ఆయన హెచ్చరించారు. చాకచక్యంగా వ్యవహరించి అనతి కాలంలోనే నిందితులను అదుపులోకి తీసుకున్న పట్టణ సిఐ సుధాకర్ రెడ్డి, ఎస్ఐ నరసింహారెడ్డి, సిబ్బందిని ఎస్‌పి గంగాధర్‌రావు అభినందించారు.

రిజిస్టర్ల నిర్వహణ తప్పనిసరి

ప్రజాశక్తి - రాయచోటి

బిఎల్‌ఒలు తప్పనిసరిగా రిజిస్టర్ నిర్వహణ చేపట్టాలని, ఈ నెలాఖరులోగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా పేర్కొన్నారు. పెండింగ్ క్లెయిములు, అభ్యంతరాలను త్వరగా పరిష్కరించాలని పేర్కొన్నారు. గురువారం విజయవాడ ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమోటోగా ఓటర్లను తొలగించరాదని, నోటీసు ఇచ్చిన తర్వాత సరిచూసుకుని మాత్రమే తదుపరి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇఆర్‌ఒ నెట్ 2.0 ఈ నెల 17 నుంచి అందుబాటులోకి రానుందని చెప్పారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ సజావుగా జరిగేందుకు ఎలెక్టోరల్ రోల్, పోలింగ్ స్టేషన్ల గుర్తింపు, ఈవిఎం, ప్లానింగ్, పోలింగ్ సిబ్బంది, బ్యాలెట్ పేపర్, లా అండ్ ఆర్డర్, ఎలక్షన్ వ్యయం పర్యవేక్షణ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, పోలింగ్, కౌంటింగ్ తదితర అంశాలపై ప్రణాళిక రచించుకుని ముందుకెళ్లాలని సూచించారు. కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో కమిటీలు ఏర్పాటు చేసి ఎస్‌ఒపి కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు లోబడి ఉండేలా నెల ఆఖరిలోపు ఒక మ్యాన్యువల్ తయారు అవ్వాలని సూచించారు. ఈవిఎంలు, వివి ప్యాట్ వాటి సంబంధిత పరికరాలను భద్రపంచడానికి గోడౌన్‌లు పూర్తి స్థాయిలో భద్రత ప్రమాణాలు మేరకు అందుబాటులో ఉండేలా చూడాలని తొందరలోనే ఈవిఎం, వివిప్యాట్, బియు, సియు, బ్యాటరీ తదితరాలు అన్ని జిల్లాలకు అందేలా షెడ్యూల్‌ను పంపుతామని సంసిద్ధంగా ఉండాలని సూచించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ గిరీష డిఆర్‌ఒ సత్యనారాయణ, ఎన్నికల సూపరింటెండెంట్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

బాధ్యతగా వ్యవహరించండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరిస్తూ గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా విద్యను, పౌష్టికాహారాన్ని అందించాలని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. రాయచోటిలోని వైఎస్ఆర్ సిపి కార్యాలయంలో లక్కిరెడ్డిపల్లె ఐసి డి ఎస్ పరిధిలోని ఖాళీలుగా ఉన్న అంగన్వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలలో ఎంపికైన 10 మంది అభ్యర్థులకు శుక్రవారం ఉద్యోగ నియామక పత్రాలను అధికారులుతో కలసి ఆయన అందచేశారు. లక్కిరెడ్డిపల్లె క్లస్టర్ పరిధిలో ఐదుగురు కార్యకర్తలు, మరో ఐదుగురు ఆయాలకు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సిడిపిఒ పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

'తపాలా'లో పెట్టుబడులతో అధిక వడ్డీ

కరపత్రం ఆవిష్కరిస్తున్న చెన్నకేశవులు, నీలిమ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మహిళల ఆర్థిక అభివృద్ధికి తపాలా శాఖ ఆధ్వర్యంలో కేంద్రం చేయూత అందించినున్నట్లు జిల్లా పోస్టల్ సూపరిండెండెంట్ ఎం.చెన్నకేశవులు పేర్కొన్నారు. గురువారం మదనపల్లె పోస్టల్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలకు మరింత ఆర్థిక భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖలో నూతనంగా మహిళ సమ్మాన్ సేవింగ్స్ పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ పథకంలో చేరే మహిళలకు తక్కువ కాలంలో అధిక వడ్డీ పొందే అవకాశం ఉందన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఈ పథకం అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. ఈ పథకం కేవలం మహిళల కోసమే ప్రారంభించినట్లు చెప్పారు. పథకంలో చేరదలచిన మహిళలు తమ సమీప పోస్ట్ ఆఫీస్‌లను సంప్రదించి మహిళ సమ్మాన్ బజత్ పత్ర యోజన ఫారంను పూర్తి చేసి ఇవ్వాలన్నారు. ఫారంతో పాటు ఆధార్, పాన్ కార్డ్ మూడు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలను జతపరచాలన్నారు. రెండేళ్ల కాల పరిమితి గల ఈ పథకంలో రూ.వెయ్యి నుంచి రూ. రూ.2 లక్షల వరకు మహిళలు పెట్టుబడులు పెట్టవచ్చున్నారు. మహిళలు పెట్టే పెట్టుబడులపై ప్రతి ఏటా 7.5 శాతం వడ్డీ ఇవ్వనున్నట్లు తెలిపారు. 2025 మార్చి 31న ఈ పథకానికి చివరి తేదీని చెప్పారు. మదనపల్లె పోస్టల్ ఎఎస్‌పి బి.నీలిమ మాట్లాడుతూ తపాలా శాఖలో ప్రత్యేకంగా మహిళల కోసం ఈ పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. మహిళ సమ్మాన్ సేవింగ్స్ పథకం కింద ఒక అకౌంట్ ఓపెన్ చేసిన మహిళ మూడు నెలల తర్వాత మళ్లీ మరో అకౌంట్ ఓపెన్ చేసే అవకాశం ఉందన్నారు. ఈ పథకంలో పెట్టుబడులు పెట్టిన మహిళలకు ప్రతి మూడు నెలలకు ఒకసారి వారి ఖాతాలో వడ్డీ జమ చేయబడుతుందన్నారు. ఈ పథకంలో చేరిన మహిళలకు రుజువుగా ధ్రువీకరణ పత్రాలు కూడా పంపిణీ చేస్తామన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో మదనపల్లె హెడ్ పోస్ట్మాస్టర్ బి.వి.రమణమూర్తి, సిబ్బంది పి.అమర్నాథ్, డి.నిర్మలాదేవి పాల్గొన్నారు.

పిఆర్ ఎస్ఇగా చంద్రారెడ్డి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారిగా కెజెఎస్ చంద్రారెడ్డి ఇన్‌ఛార్జి ఎస్‌సిగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీర్ సురేష్ కుమార్ విజయవాడకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లా డుతూ తాను రాజంపేట ఇఇగా బాధ్యతలు నిర్వహిస్తూ రాయచోటిలో ప్రస్తుతం అదనపు బాధ్యత నుంచి ఇక్కడ బదిలీ అయ్యానని పేర్కొ న్నారు. గతంలో కడప పలు ప్రాంతాలలో పనిచేశానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ప్రచార భేరిని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిరసనగా ఈ నెల 14వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రచార భేరిని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేష్, సిపిఎం నియోజకవర్గ కార్యదర్శి సి.రవికుమార్ కోరారు. గురువారం సిపిఐ కార్యాలయంలో ప్రచార బేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి కార్పొరేట్ మతోన్మాదం విధానాలను ప్రజలలో ఎండగట్టాలన్నారు. దేశాన్ని ఆదానికి అప్పజెప్పడానికి మోడీ ప్రయత్నం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం.శివరామకృష్ణదేవరా, ఏరియా సహాయ కార్యదర్శి ఎమ్మెస్ రాయుడు, పట్టణ కార్యదర్శి సికిందర్, నాగేశ్వర్ పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతి శుభాకాంక్షలు
భారత రాజ్యాంగ నిర్మాత, రాజకీయ నాయకుడు, స్వతంత్ర భారత తొలి న్యాయశాఖ మంత్రి, స్వాతంత్రోద్యమ దళిత నాయకుడు, బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా పట్టణ ప్రజలకు, అధికారులకు, విద్యార్థులకు, తల్లిదండ్రులకు శుభాకాంక్షలు.
బి.నారాయణ స్వామి B.A.,T.P.T
ఇందిరా ఇంగ్లీష్ మీడియం స్కూల్, బ్రాహ్మణవీధి, రాయచోటి, అన్నమయ్య జిల్లా.
సెల్ : 9966281807.

అంబేద్కర్ జయంతి శుభాకాంక్షలు
ప్రపంచ మేధావి, అభ్యుదయ వాది, ప్రగతిశీల వాది, భారత రాజ్యాంగ నిర్మాత, దళిత బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి శుభాకాంక్షలు.
సింగన్న
బాస్, జిల్లా కార్యదర్శి
కె.శ్రీనివాసులు
బాస్, బి.కొత్తకోట మండల ప్రెసిడెంట్

అంబేద్కర్ జయంతి శుభాకాంక్షలు
ధర్మశాస్త్ర పండితుడు, భారత రాజ్యాంగ నిర్మాత, రాజకీయ నాయకుడు, స్వతంత్ర భారత తొలి న్యాయశాఖ మంత్రి, స్వాతంత్రోద్యమ దళిత నాయకుడు, బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి శుభాకాంక్షలు.
అంబరీష్
మాలమహానాడు మండల అధ్యక్షులు, రామసముద్రం

అంబేద్కర్ జయంతి శుభాకాంక్షలు
భారత రాజ్యాంగ నిర్మాత, రాజకీయ నాయకుడు, బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి శుభాకాంక్షలు.
శ్రీ వశిష్ఠ హైస్కూల్ ఆధ్వర్యంలో
అవని సైనిక్ అండ్ నవోదయ కోచింగ్ సెంటర్
లతీఫ్‌వల్ల మిషన్ వీధి, బోస్ నగర్, రాయచోటి, అన్నమయ్య జిల్లా.
జి.ఆంజనేయులు
M.Sc.,B.Ed (Maths)
ప్రిన్సిపాల్. సెల్: 9985258005.
పి.ప్రభాకర్
M.Sc.,B.Ed
కరస్పాండెంట్. సెల్: 9676614875.

అంబేద్కర్ జయంతి శుభాకాంక్షలు
భారత రాజ్యాంగ నిర్మాత, రాజకీయ నాయకుడు, పేద, బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా పట్టణ ప్రజలకు, అధికారులకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు శుభాకాంక్షలు.
జె.రామాంజనేయులు, M.A.,B.Ed.,
కరస్పాండెంట్,
సంగీత ఇంగ్లీష్ మీడియం స్కూల్, రాయచోటి.
అన్నమయ్య జిల్లా. సెల్: 9440954540.

అంబేద్కర్ జయంతి శుభాకాంక్షలు
భారత రాజ్యాంగ నిర్మాత, రాజకీయ నాయకుడు, పేద, బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా పట్టణ ప్రజలకు, అధికారులకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు శుభాకాంక్షలు.
ప్రభాకర్ పిల్లాయి
కరస్పాండెంట్,
నలంద స్కూల్,
రాయచోటి, అన్నమయ్య జిల్లా.

అంబేద్కర్ జయంతి శుభాకాంక్షలు
ధర్మశాస్త్ర పండితుడు, భారత రాజ్యాంగ నిర్మాత, రాజకీయ నాయకుడు, స్వతంత్ర భారత తొలి న్యాయశాఖ మంత్రి, స్వాతంత్రోద్యమ దళిత నాయకుడు, బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి శుభాకాంక్షలు.
ప్రజాశక్తి అభిమాని
పీలేరు,
అన్నమయ్య జిల్లా.

విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఎన్‌సిసి అధికారులు

ఎన్‌సిసి విద్యార్థులకు శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-కురబలకోట

స్థానిక మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సిసి విద్యార్థులకు తలసైనికల క్యాంపు శిక్షణను చిత్తూరు లోని పివికెఎన్ కళాశాలలో నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ అన్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ 34 మంది క్యాడెట్స్ ఇందులో పాల్గొన్నట్లు తెలిపారు. 35 ఆంధ్ర బెటాలియన్ చిత్తూరు వారు ఈ శిక్షణను ఇస్తున్నట్లు అన్నారు. తలసైనిక క్యాంపు సికింద్రాబాదులో జరుగుతుందని, ఈ శిక్షణలో అబ్స్టాకిల్ కోర్సు లో భాగంగా క్యాడెట్‌లను శారీరకంగా, మానసికంగా దృఢంగా మార్చే శిక్షణా కార్యకలాపం అని అన్నారు. ఈ శిక్షణ చురుకుదనం, ధైర్యం, విశ్వాసాన్ని పెంచుతుందని అన్నారు. ముఖ్యంగా ప్రతి క్యాడెట్స్ కు ఫైరింగ్, స్ట్రెయిట్ బ్యాలెన్స్, క్లియర్ జంప్, జిగ్‌జాగ్ బ్యాలెన్స్, హైవాల్, డబుల్ డిచ్, రైట్ హ్యాండ్ వాల్ట్, లెఫ్ట్ హ్యాండ్ వాల్ట్, గేట్ వాల్ట్ ర్యాంప్ పై శిక్షణను సుబేదార్ మేజర్ బస్నేట్ ఆద్వర్యం శిక్షణను అందిచారు. కార్యక్రమంలో ఎన్‌సిసి ఎఎన్‌ఒ లెఫ్టినెంట్ నవీన్ కుమార్, ఎన్‌సిసి క్యాడెట్స్ పాల్గొన్నారు.

గ్రామ సమాఖ్య కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న ఖాదర్‌వలి

రుణాలు సక్రమంగా చెల్లించాలి

ప్రజాశక్తి-వీరబల్లి

తీసుకొన్న రుణాలను సక్రమంగా చెల్లించాలని వైఎస్ఆర్ క్రాంతి పథకం సహయ ప్రాజెక్ట్ మేనేజర్ ఖాదర్‌వలి కోరారు. గురువారం స్థానిక దేవాలయంలో జరిగిన ఈడిగపల్లి గ్రామ సమాఖ్య కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. రుణాలు సక్రమంగా చెల్లించడం వల్ల ప్రభుత్వం ఇచ్చే రాయితీ వడ్డీకి అర్హత ఉంటుందన్నారు. స్వయం సహాయక సంఘాలు ప్రతినెల క్రమంతప్పని సమావేశాలు ఏర్పాటు చేసుకొని ఆర్థిక లావాదేవీలు చేసుకోవడం వల్ల సుస్థిరత సాధిస్తాయని అన్నారు. మంచి సంఘాలకు ప్రభుత్వం అమలు చేసే వైఎస్ఆర్ సున్నావడ్డీ, స్త్రీనిధి, వైఎస్ఆర్ఆసరా, చేయూత, జగనన్నతోడు మొదలగు రుణాలు అందుకోవచ్చని తెలిపారు. సమాఖ్యలోని అన్ని సంఘాలు ఎ గ్రేడ్‌లో ఉండేలా సిబ్బంది చూడాలన్నారు. చెల్లింపులకు రశీదు తప్పక తీసుకొని భద్రపరచుకోవాలన్నారు. అన్ని రుణాలకు వంద శాతం రికవరీ ఉండేలా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిసిలు కుల్లాయప్ప, శుభద్రమ్మ, స్త్రీనిధి మేనేజర్ సుధీర్, విఒఎ తులసి, సమాఖ్య అధ్యక్షురాలు అనసూయ, కార్యదర్శి వరలక్ష్మి, కోశాధికారి రమాదేవి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- కలకడ

భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం మండలంలో ఎక్కడా లేదని విగ్రహ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. మండలంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ వర్గాలకు చెందిన నాయకులు ఉన్నప్పటికీ డాక్టర్ అంబేద్కర్ విగ్రహ స్థాపనకు నోచుకోకపోవడం శోచనీయమన్నారు. అంబేద్కర్ విగ్రహ స్థాపనకు పాటుపడే వ్యక్తులే కరువయ్యారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు కృషి చేయాలని కోరుతున్నారు.

రెడ్డెన్న కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని బండపల్లె పంచాయతీ దిగువహరిజనవాడ కు చెందిన ఒట్టికాళ్ళ రెడ్డెన్న ఇటీవల మృతి చెందారు. గురువారం దిగువ హరిజన వాడకు ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి వెళ్లి రెడ్డెన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. రెడ్డన్న పార్టీకి చేసిన సేవలను శ్రీకాంత్ రెడ్డి గుర్తుకు చేసుకుని, వారి సేవలు మరువలేనివని, వారి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు రవిశంకర్ రెడ్డి (బాబు), మాజీ ఎంపిపి కదిరన్న, మాజీ సర్పంచ్ మనోహర్, భరత్, రామ్మోహన్, అంజి, నాగలేసు, నాగరాజు, వెంకట రమణ పాల్గొన్నారు.

నేడు ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నందలూరు గ్రామపంచాయతీ షాదీఖానాలో శుక్రవారం మండలంలోని ముస్లిం సోదరులకు రంజాన్ మాసం పురస్కరించుకొని పెద్ద ఎత్తున ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయనున్నట్లు నందలూరు ఉప సర్పంచ్ ఇబ్బు, ఎంపిటిసి సుభాన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గ యువనాయకులు మేడా విజయ శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ విందును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలోని ముస్లిం సోదరులందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్‌కు వినతి పత్రం అందిస్తున్న యోగా టీచర్లు

యోగా సాధనకు అవకాశం కల్పించాలి

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాల్లో ఉదయం, సాయంత్రం ఒక గంట పాటు యోగా సాధనకు అవకాశం కల్పించాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావుకు యోగా టీచర్స్ వినతి పత్రాన్ని సమర్పించారు. గురువారం యోగా మాస్టర్లు డాక్టర్ పివిఎస్.లక్ష్మి, డాక్టర్ రాయల సుధాకర్ రాయలు ఆధ్వర్యంలో యోగా టీచర్లు ఆయనను తిరుపతిలో కలిసి వినతి పత్రం సమర్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 1500 గ్రంథాలయాలున్నాయని యోగా టీచర్లకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యోగా టీచర్లు ముని, మంజుల, వరదరాజులు, లోకేష్, అమర్నాథ్, చంద్రశేఖర్ యోగా టీచర్లు పాల్గొన్నారు.

నేడు సులభ్ కాంప్లెక్స్‌కు భూమిపూజ

ప్రజాశక్తి-నందలూరు

స్థానిక బస్టాండ్ కూడలిలో శుక్రవారం ఉదయం సులభ్ కాంప్లెక్స్‌కు భూమి పూజ నిర్వహించనున్నట్లు మేడా విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సులబ్ కాంప్లెక్స్ లేక ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారి ఇబ్బందులు చూసి ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని అన్నారు. ఆయన ఆదేశాల మేరకు సులబ్‌కాంప్లెక్స్‌కు భూమిపూజ నిర్వహించనున్నట్లు తెలిపారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు : 'గడికోట'

ప్రజాశక్తి చిన్నమండెం

నియోజక వర్గ పరిధిలోని గ్రామాలలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని బోనమలలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులుతో జడ్‌పి మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డితో కలసి తాగునీటి సమస్య, పనులలో వేగం పెంచడంపై మండలాల వారీగా సమీక్షా సమావేశం నిర్వహించారు. రక్షిత మంచి నీటి పథకాలకు డిమాండ్ నోటీసు రూ 2.20 కోట్ల నిధులు కట్టకుండానే 74 ట్రాన్స్ ఫార్మర్లు మంజూరు చేయించామని, ఆ ట్రాన్స్ ఫార్మర్లను త్వరితగతిన ఏర్పాటు చేయాలని చెప్పారు. నియోజక వర్గానికి త్రాగునీటి వసతుల కోసం జెజెఎం నిధుల కింద మంజూరైన రూ.147 కోట్ల పనులలో వేగం పెంచాలన్నారు. నారాయణ రెడ్డి గారిపల్లె జగనన్న కాలనీలో జెజెఎం నిధుల క్రింద మంజూరైన రూ.22 కోట్ల పనులు టెండర్ దశలో ఉన్నాయని తెలిపారు. తాగునీటి బోర్ల మరమ్మతులు, ఇతర త్రాగునీటి వసతుల కల్పనకు యుద్ధప్రాతిపదికన కలెక్టర్ ప్రత్యేక నిధులను మంజూరు చేయిస్తామన్నారు. అధికారులు ప్రత్యేక కృషి, శ్రద్ధతో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ శ్రీనివాసులురెడ్డి, లక్కిరెడ్డిపల్లె డిఇ శ్రీనివాసులు రెడ్డి, డిఎల్‌డిఒ మల్‌రెడ్డి, బోనమల సర్పంచ్ అఫ్రోజ్, ఎంపిటిసి వెంకటప్ప నాయుడు, అన్ని మండలాల ఎఇలు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

అంబేద్కర్ సేవలు అజరామరం : ఎంపిడిఒ

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి

దేశానికి, సమాజానికి ప్రపంచ మేధావి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అందించిన సేవలు అజరామరం అని ఎంపిడిఒ సగిలి విజయరావ్ కొనియా డారు. ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ జయం తిని అంతర్జాతీయ నాలెడ్జి దినోత్స వంగా ఐక్యరాజ్యసమితి ప్రకటిం చడం ఆయన మేధో సంప త్తికి నిద ర్శనం అన్నారు. దేశంలో పవర్‌గ్రిడ్ స్టోరేజ్ సప్లయ్ వ్యవస్థ, హీరాకుడ్, దామోదర్ వ్యాలీ రూప కల్పన, ఆలోచనలు అంబేద్కర్‌దే నన్నారు. హిల్టన్ యాంగ్ రిపోర్ట్ ఆధారంగా ఏర్పడిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పాటు వెనుక ఆయన కృషి, చొరవ అభినం దనీయం అన్నారు. స్త్రీలకు సమాన హక్కులు కల్పించాలని హిందూ కోడ్ బిల్ ప్రవేశపెట్టిన ఘనత కూడా ఆయ నకే దక్కుతుందన్నారు. కొలం బియా యూనివర్శిటీలో ఆర్థిక నిపు ణులు, ప్రపంచ కమ్యూనిస్ట్ నేత కార్ల్ మార్క్స్ చిత్రపటం పక్కనే అంబేద్కర్ చిత్ర పటానికి చోటు లభించడం వెనుక గల ఆయన గొప్పదనం ఏపాటిదో అర్థ మవు తుందని అన్నారు. అంబేద్కర్ ఆర్థిక శాస్త్రంలో తనకు తండ్రి లాంట ివారని ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త అమర్త్యసేన్ ఒకసారి కొనియా డారన్నారు. ఆయనను కొందరు దళిత, గిరిజనోద్ధారకుడు మాత్ర మే అని అనుకుంటూ పొరబ డుతూ ఉంటారని తన కుటుంబాన్ని త్యాగం చేసి దేశ ప్రజలతో పాటు అణగారిన వర్గాల అభివృద్ధి కోసం రాజీలేని పోరాటం చేసిన యోధుడు అన్నారు. ఒక ఆర్థిక శాస్త్రవేత్త, రాజకీయ నేత, గొప్ప సంఘ సంస్కర్త అయిన అంబేద్కర్ ఆశయ సాధన కోసం ఆయన చూపిన మార్గం కోసం మన నడచి నప్పుడే ఆయనకు మనము ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ సగిలి విజయరావ్

వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి : ఆర్ఆర్

రమేష్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు,కార్యకర్తలు

ప్రజాశక్తి-చిన్నమండెం

రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేసిన వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కొత్తపల్లె పంచాయితీలో టిడిపి ఆధ్వర్యంలో జరిగిన ఇదేంఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైసిపి పాలనలో అవినీతి, అరాచకాలు ఎక్కువ అయ్యాయని ప్రజలకు వివరించారు. గ్రామంలో గుంతల మయమైన రోడ్లలో ప్రయాణించాలంటే నరకం కనబడుతోందని అన్నారు. విపరీతంగా పెంచిన నిత్యావసర సరుకుల ధరలు, విద్యుత్ చార్జీలు,పెట్రోల్ డీజిల్ ధరలతో పాటు బస్ చార్జీలు కూడా పెరగడంతో నానా ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు తమ గోడును రమేష్‌రెడ్డికి విన్నవించారు. రైతులు భూములను కోల్పోయి,ఉపాధి కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న ప్రభుత్వం ఆదుకోకపోవడం ఒక దారుణమన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అందరికీ న్యాయం చేస్తామని చెప్పారు. కుక్కలపై కేసు పెట్టడం ప్రపంచంలోనే మొదటిసారిగా చూస్తానని దీనిని బట్టి చూసే వైసిపి ప్రభుత్వం ఎంత దిగ జారిపోయిందో అందరికీ అర్థమవు తుందన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి ఇన్‌ఛార్జి నరసింహారెడ్డి, రాజంపేట పార్లమెంట్ కార్య నిర్వహణాధికారి హరి అమర్‌నాథరెడ్డి , బిసి సెల్ పార్లమెంట్ కార్య నిర్వహణ అధికారి అలాగాని రెడ్డప్ప, రాజంపేట రైతు విభాగం అధ్యక్షుడు చెన్న కృష్ణారెడ్డి, నాగభూషణం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-నందలూరు

పట్టణంలోని బస్టాండ్ కూడలిలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్.బిఆర్.అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం ఉదయం 8 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపిపి మేడా విజయ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గ పరిధిలోని ప్రజలు, దళిత నాయకులు, ప్రజా ప్రతినిధులు నాయ కులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ జంబు సూర్య నారాయణ, నాయకులు ఆర్మగం విశ్వనాథ్, పెనుబాల నాగ సుబ్బ య్య, కాకిచంద్ర, కొమ్మలశివ, నరసింహ, బలరాం, తుమ్మాది శివ పాల్గొన్నారు.

ఎంజెఆర్‌లో 'సింపోజియం' విజయవంతం

ప్రజాశక్తి-పీలేరు

స్థానిక ఎంజెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులపాటు జరిగిన జనిత్ 2కె24, జాతీయ స్థాయి టెక్నికల్ సింపోజియం కార్యక్రమాలు విజయవంతమయ్యాయి. బుధ, గురువారం రెండు రోజులపాటు జరిగిన జబర్దస్త్ కళాకారుల హాస్యవల్లరి, ఢీ-10 డ్యాన్స్ ప్రోగ్రాంలో పాల్గొని, పలువురి ప్రశంసలు అందుకున్నారు. ఎంజెఆర్ కళాశాల పాలిటెక్నిక్ విద్యార్థులు నవ్య, భవ్య, హరిచందన బృందం చేసిన డ్యాన్సులు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంజెఆర్ కళాశాల చైర్మన్ ఎంపి అవినాష్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సుధాకర్ రెడ్డి, పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ ద్వారకనాథరెడ్డి, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలను నిర్మూలించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్రంలో మాదకద్రవ్యాలను నిర్మూలించి యువత జీవితాలు కాపాడాలని నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు నాదెండ్ల అరుణ్‌తేజ డిమాండ్ చేశారు. వైసిపి పాలనలో గంజాయి, డ్రగ్స్ మాఫియాతో యువత భవిత నిర్వీర్యమైందన్నారు. యువతకు సరైన ఉపాధి అవకాశాలు కల్పించకపోవడం వల్ల చాలా వరకు మత్తు పదార్థాలను బానిసలవు తున్నారని అన్నారు. గంజాయి, డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చేనేతల ఆత్మహత్యలు ప్రభుత్వాలకు కనబడలేదా?

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

చేనేత కార్మికుల ఆత్మహత్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కనపడలేదా అని మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా ప్రశ్నించారు. గురువారం పట్టణంలోని నీరుగట్టువారిపల్లి, చౌడేశ్వరివీధి -4లో నివాసముంటున్న వెంకటేష్ అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రభుత్వాసుపత్రికి చేరుకొని మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు సంవత్సరానికి ఒకసారి నేతన్న నేస్తం పథకం ద్వారా రూ.24 వేలు మాత్రం ఇచ్చి చేతులు దులుపుకొంటోందని విమర్శించారు. 80 శాతం మంది కార్మికులకు అందడం లేదన్నారు. చేనేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడడం బాధాకరమని, వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉదారంగా ఆదుకోవాలని పేర్కొన్నారు. చేనేత కార్మికులు ఎవరు అధైర్య పడవద్దని, వారికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. అనంతరం ఎపి బిసి సంక్షేమ సంఘం చేనేత యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఓర్సు వీరభాస్కర్ మాట్లాడుతూ రేషం వార్పులు, జరీలు అధిక ధరలు పెరగడం వల్ల పనులు లేక కార్మికుల పరిస్థితి దయనీయంగా మారిందని వాపోయారు. చేనేత కార్మికులు రోజు రోజుకి ఆర్థికంగా చితికిపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మృతి చెందిన చేనేత కార్మికుడి కుటుంబానికి దహనక్రియలు సమయంలో రూ.20 వేలు ఇవ్వాలనీ, కుటుంబానికి రూ.20 లక్షలు విలువచేసే బీమాను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గిరీష్ కుమార్, ఇంతియాజ్, అమర, బిసి సంక్షేమ సంఘం జిల్లా నాయకులు రమేష్ నాయుడు, బాబ్ జాన్, మోహన్ పాల్గొన్నారు.

జగన్‌కు రైతుల ఉసురు తప్పదు :'బత్యాల'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అహర్నిశలు శ్రమించి పంటలను పండిస్తూ అందరికీ అన్నం పెడుతున్న రైతులకు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసి వారి నుంచి అదనపు విద్యుత్ ఛార్జీలను వసూలు చేస్తూ అటు రైతులు ఇటు ప్రజలపై భారం మోపుతున్న సిఎం జగన్‌కు వారి ఉసురు తప్పదని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్యాల చంగల్రాయుడు అన్నారు. ధ్వజమెత్తారు. గురువారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలను జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తన ఇష్టానుసారంగా పెంచి అటు రైతులు ఇటు ప్రజల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. టిడిపి హాయంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కరెంటును ఉత్పత్తి చేసి ఇతర రాష్ట్రాలకు అమ్ముకునే వారని చెప్పారు. ఆయన దిగిపోయేటప్పుడు మిగులు విద్యుత్తు ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు, అసెంబ్లీ రైతు విభాగం అధ్యక్షులు పొట్టేటి వెంకటసుబ్బారెడ్డి, వాణిజ్య భాగం అసెంబ్లీ అధ్యక్షులు సత్య నరసింహ గుప్తా, పార్లమెంట్ మహిళా అధ్యక్షులు కె.ఆర్ అనసూయదేవి, పార్లమెంట్ అధికార ప్రతినిధి అద్దేపల్లి ప్రతాప్‌రాజు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు కొండయ్య నాయుడు, బాసినేని వెంకటేశ్వర్లు నాయుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి మండెం అబుబాకర్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు, పార్లమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొండా శ్రీనివాసులు, మండల కార్యనిర్వాహక కార్యదర్శి ఓబిలి మల్లికార్జున్ రెడ్డి, మునక్కాయలపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు రమణ రాజు, తెలుగుయువత అసెంబ్లీ ఉపాధ్యక్షులు అనమలగుండం విజయ్‌కుమార్, శివశంకర్, సింగనమల నాగార్జున, చుక్కా రామయ్య పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకులను శుభ్రపరచండి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

తాగునీటి ట్యాంకులను క్రమంగా శుభ్రపరచాలని రాచవేటివారిపల్లి సర్పంచ్ సుబ్రమణ్యం(మధు) అన్నారు. గురువారం పంచాయతీ కార్యదర్శి గాయత్రితో కలిసి ఆర్.మాదిగపల్లిలో మంచినీటి ట్యాంకులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో నెలకు ఒకసారి క్రమం తప్పకుండా మంచినీటి ట్యాంకులను శుభ్రపరచాలని అన్నారు. నీటి ద్వారా ప్రజలకు అంటువ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ కలపాలని పారిశుధ్య కార్మికులకు సూచించారు. ప్రతి ఇంటికి నీటి కొళాయి ద్వారానే తాగునీరుని అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గాయత్రి, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ గురుప్రసాద్, సిబ్బంది దినేష్, ఆశ వర్కర్, నరసింహులు పాల్గొన్నారు.

కార్యవర్గ సమావేశాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఈనెల 17,18వ తేదీలలో రెండు రోజుల పాటు తిరుపతి కేంద్రంగా జరుగు ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి అనుబంధ సంఘాల జాతీయ కార్యవర్గ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఎంఎస్‌పి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దుమ్ము చిన్నా మాదిగ పిలుపునిచ్చారు. ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరవుతారని అన్నారు. దేశ నలుమూలల నుంచి ఎంఆర్‌పిఎస్ నాయకులు కూడా పాల్గొంటారని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు.

భూసార పరీక్షలపై అవగాహన

కలికిరి : భూసార పరిస్థితులపై ఎఒ మమతారెడ్డి ఆధ్వర్యంలో రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వాల్మీకిపురం సహాయ వ్యవసాయ సంచాలకులు కె.వాణిశ్రీ పాల్గొని మాట్లాడారు. మట్టి నమూనాలను తీయటం, వాటి అవశ్యకతను వివరించారు. కెవికె శాస్త్రవేత్త ఎస్.సోమశేఖర్ బాబు మాట్లాడుతూ నేల రకాలు, నేలలో గల ఉదజని, సూచిక లవణ సూచిక, సేంద్రియ కర్బనం వాటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. నేలలో గల పోషక విలువలు పంటకు ఏ విధంగా ఉపయోగపడతాయో క్లుప్తంగా వివరించారు. జిల్లా వనరుల కేంద్రం నుంచి సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.వి.శ్రీకాంత్ మాట్లాడుతూ సమస్యాత్మక భూములు ఏవిధంగా సాగులోకి తీసుకొని రావలెను అనే విషయాలు, నేల ఆరోగ్యం కొరకు వాడవలసిన పచ్చిరొట్ట ఎరువుల వినియోగం, భూసార పరీక్షా ఫలితాల నమునా పత్రంను అనుసరించి సిఫారసు చేసిన ఎరువులను వాడకం గురించి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఆర్‌జెడి ఎంవి.కృష్ణారెడ్డి

విద్యా కానుక పంపిణీలో జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి-వీరబల్లి

జగనన్న విద్యాకానుక పంపిణీలో జాగ్రత్తలు పాటించాలని రాష్ట్ర ఆదర్శ పాఠశాలల జాయింట్ డైరెక్టర్ ఎం.వెంకట కృష్ణారెడ్డి కోరారు. గురువారం మండల పరిషద్ కార్యాలయంలో జగనన్న విద్యాకానుక పంపిణీలో ఎలాంటి అవరోధాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను తెలిపారు. ప్రణాళికా బద్దంగా స్టాక్ పాయింట్ ఎంపిక నుంచి మండలంలోని అన్ని పాఠశాలలకు కిట్లు చేరేలా చేసుకోవాలన్నారు. అనంతరం పదవ తరగతి పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఇఒ గిరివరదయ్య,స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గంగాదేవి, మండల ఇంజనీర్ జిలానీబాషా, ఏపియం ఖాదర్ వలి, విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. **రామాపురం :** జగనన్న విద్యా కానుక కిట్లను సకాలంలో పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని జెవికె-4 స్పెషల్ ఆఫీసర్ వెంకటకృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. మండలంలో నాలుగో సంవత్సరం ప్రభుత్వం సరఫరా చేసే జగనన్న విద్యా కానుక లోని వస్తువులను నిల్వజేసే మండల ఆదర్శ పాఠశాలను గురువారం పరిశీలించారు. జగనన్న విద్యా కానుక వస్తువులను నిల్వ చేయడానికి మండల విద్యాశాఖ అధికారులు గుర్తించిన నిలవ కేంద్ర గదులను ఆయన పరిశీలించారు. మండల నిల్వ కేంద్రానికి వచ్చిన విద్యా కానుక వస్తువులు నాణ్యమైనవా కాదా అని మండల స్థాయిలో మండల ఇంజినీర్, ఎపిఎంలు చూడాలన్నారు. నిల్వ ఉంచిన జగనన్న విద్యా కానుక వస్తువులను జాగ్రత్తగా చూడవలసిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ఎంఇఒ రామకృష్ణుడు, ఏపిఎం, కో-ఆర్డినేటర్ డేటా ఐఇ, ఆర్‌టిలు, సి అర్‌పిలు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లి ప్రాజెక్టు పరిధిలోని 273 అంగన్వాడీ కేంద్రాలకు సంబంధించిన అంగన్వాడీ కార్యకర్తలతో మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ అధికారిని ధనలక్ష్మి సమీక్షా సమావేశం నిర్వహించారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, శాఖ పరమైన ఇండికేటర్స్ పైన సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె ప్రాజెక్ట్ ముందడుగులో ఉండాలన్నారు. సమావేశంలో సిడిపిఒ నాగవేణి, ఎంపిడిఒ ఆనంద్‌కుమార్ సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు హాజరయ్యారు.

ఎద్దులవారిపల్లెలో 'జగనన్నే మా భవిష్యత్తు'

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు..మా నమ్మకమే జగనన్నే కార్యక్రమాన్ని గురువారం మండలంలో ఎద్దులవారిపల్లి గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ రజిని, సురేంద్ర, ఎంపిటిసి కరీముల్లా గ్రామ సర్పంచ్ రెడ్డినారాయణ, వాటర్‌షెడ్ చైర్మన్ నరసింహారెడ్డి, సచివాలయం కన్వీనర్ శ్రీరాములు, ఎద్దులవారిపల్లె వైసిపి కమిటీ చైర్మన్ అమర్నాథ్, గృహ సారథి అన్వర్ భాష, ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ స్పష్టం చేశారు. ఆస్పత్రి అభివృద్ధి సలహా మండలి సమావేశం గురువారం ఆస్పత్రి ఆవరణంలో జరిగింది. ఈ సందర్భంగా పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ కిరణ్ మాట్లాడుతూ మండలంలోని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తామని, చిన్నపిల్లల విభాగానికి వైద్యులుగా సతీశ్‌నాయక్‌ను నియమించినట్లు చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే ద్వారాకనాథ్‌రెడ్డి కృషితో వైద్యులు, స్టాఫ్ నర్సులను నియమించామన్నారు. ప్రతీ పేదవాడికి అత్యుత్తమ వైద్యసేవలు అందించడం, మెరుగైన సౌకర్యాలు కల్పనకు కృషి చేసేటట్లు తీర్మానం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి కమిటీ మెంబర్ నక్కా సంతోష్, హసీనా, ఆరీఫ్, సత్య వైద్యులు, వైద్య సిబ్బంది, వైద్యేతర సిబ్బంది పాల్గొన్నారు.

బిపి మండల్‌కు ఘన నివాళులు

ప్రజాశక్తి-కలికిరి

బిపి మండల్ వర్ధంతి సందర్భంగా బిసి ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు.బిసి ఉద్యోగ సంఘం నాయకులతో కలిసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయానికి దిక్సూచి, బి.పి. మండల్ సిఫార్సు లను చర్చించారు. మేమెంతో మాకంత పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బిసి ఉద్యోగ నాయకులు శంకర్, చంద్రశేఖర్, హరికృష్ణ, రెడ్డిమోహన్ , హరినాథ్ , భాస్కర్, సురేష్ , సహదేవ్ , డేవిడ్, రమణ లు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

భానుప్రకాష్ (ఫైల్ ఫొటో)

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ రామ్మోహన్ కథనం మేరకు వివరాలు.. మదనపల్లి పట్టణం, పిఅండ్‌టి కాలనీలో నివాసముంటున్న శివ నారాయణ కుమారుడు కోటకొండ భాను ప్రకాష్ (29) అనే యువకుడు బుధవారం రాత్రి సుమారు 10.30 గంటలకు ద్విచక్రవాహనంలో మదనపల్లికి వస్తుండగా నాయనబావి వద్ద తనకు ఎదురుగా వస్తున్న ఆటో భాను ప్రకాష్ బైక్‌ను ఎదురుగా ఢీకొనడంతో భాను ప్రకాష్ తలనుదుటిపైన, ఎడమకాలు తొడపైన బలమైన రక్త గాయాలయ్యాయి. వెంటనే వాహనదారులు 108 ద్వారా మదనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. అక్కడ వైద్యులు చికిత్స చేసి మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి రెఫర్ శారు. తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. రోడ్డు ప్రమాదం ఆటో డ్రైవర్ సుదర్శన్ వల్లే జరిగిందని, ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగిందని ఎస్ఐ వెల్లడించారు.

35 లీటర్ల నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల పరిధిలో అక్రమంగా నాటు సారాను విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని, అతను వద్దనుంచి సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఇంచార్జ్ ఎస్ఐ సుధాకర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..వాల్మీకిపురం మండలం, చింతపర్తి పంచాయతీ మేకలవారిపల్లికు చెందిన తుపాకుల భాస్కర గురువారం నిమ్మనపల్లి మండలంలోని కొండసానివారిపల్లి క్రాస్ వద్ద అక్రమంగా 35 లీటర్ల నాటు సారాను తీసుకువచ్చి స్థానికులకు అమ్మడానికి ప్రయత్నిస్తుండగా, పోలీసులకు రాబడిన సమాచారం దాడుల నిర్వహించి అతనిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి 35 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి, రిమాండ్ కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.